సాక్షి నిజామాబాద్

గురువారం । 21 । ఆగస్టు । 2025



పండుగలు ప్రశాంతంగా..

వినాయక చవితి, మిలాద్‌–ఉన్‌–నబీ వేడుక లను ప్రశాంత వాతావరణంలో జరుపుకో వాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అన్నారు.

- 8లో ▸



బీజేపీలో కార్యకర్తలకు..

బీజేపీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

29.5 /22.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ మోస్తరు వర్షం కురుస్తూ గాలులు వీసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

3,817 ఎకరాల్లో పంటనష్టం

- వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా



హంగర్గలో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న డీఏవో గోవింద్‌

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లాలో 3,817 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. ఈ నష్టం మొత్తం బోధన్‌ డివిజన్‌లోనే జరిగింది. గోదావరికి ఆనుకుని ఉన్న మండలాలు, గ్రామాల్లో భారీగా పంటలు వరద నీట మునిగాయి. అత్యధికంగా 3,355 ఎకరాల్లో సోయా, 450ఎకరాల్లో వరి, ఐదెకరాల్లో పత్తి, మరో ఐదెకరాల్లో పెసర, రెండెకరాల్లో పసుపు పంటలకు నష్టం వాటిల్లింది. రెంజల్‌ మండలంలోని కల్దుర్కి, తాడ్‌బిలోలి, బోర్గాం, బోధన్‌ మండలం హంగర్గ, కొప్పర్గ, బికినెల్లి, ఖండ్‌గావ్‌, సిద్ధాపూర్‌, అలాగే సాలూర మండలం హున్సా, ఖాజాపూర్‌, మందర్న, తగ్గెల్లి గ్రామాల్లో పంటలు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. మొత్తం 1,092 మంది బాధిత రైతుల పేర్లు నమోదు చేసుకున్నారు. ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని, వరద నీటి నుంచి పంట తేలిన తర్వాత తుది నివేదికను ప్రభుత్వానికి పంపుతామని డీఏవో గోవింద్‌ 'సాక్షి'కి తెలిపారు.

కార్పొరేషన్‌ కమిషనర్‌గా యాదగిరిరావు

- అడిషనల్‌ కమిషనర్‌గా రవీంద్రసాగర్‌
- నేడు బాధ్యతలు స్వీకరించనున్న అధికారులు
- దిలీప్‌కుమార్‌కు ఐఏఎస్‌ ఖరారు



యాదగిరిరావు

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ ఎస్‌ దిలీప్‌కుమార్‌కు ఐఏఎస్‌ ఖరారు కావడంతో ఆయనకు శిక్షణకు వెళ్లనున్నారు. నూతన కమిషనర్‌గా ఎస్‌ యాదగిరిరావు నియమితులయ్యారు. తెలంగాణలోని పలు కార్పొరేషన్ల కమిషనర్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవా రం జీవో ఎంఎస్‌ నంబర్‌ 87 జారీ చేసింది. సెలక్షన్‌ గ్రేడ్‌ మున్సిపల్‌ కమిషనర్‌గా వెయిటింగ్‌లో ఉన్న ఎస్‌.యాదగిరిరావు నిజామాబాద్‌కు రానున్నారు. అడిషనల్‌ కమిషనర్‌గా పి రవీంద్రసాగర్‌ నియమితులయ్యారు. గురువారం ఉదయం ఇరువురు ఉన్నతాధికారులు బాధ్యతలు స్వీకరించనున్నారు.

డీజేలు నిషేధం : సీపీ



ఖలీల్‌వాడి: గణేశ్‌ మండలి నిర్వాహకులు ని బంధనలు తప్పనిసరిగా పాటించాలని సీపీ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, వాటిని పూర్తిగా నిషేధించినట్లు పే ర్కొన్నారు. మండపాల వద్ద విద్యుత్‌ తీగల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటలకు లౌడ్‌ స్పీకర్లు ఆఫ్‌ చేయాలని పేర్కొన్నారు. మండపాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్‌ 100కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రతిష్టాపన, నిమజ్జనం శాంతియుతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

పెండింగ్‌లోనే..

సీఎంఆర్‌ రికవరీని సీరియస్‌గా తీసుకోని అధికారులు

- ఇన్‌చార్జి మంత్రుల ఆదేశాలు బేఖాతర్‌
- గతంలో మంత్రి జూపల్లి, ప్రస్తుత మంత్రి సీతక్క ఆదేశించినప్పటికీ ఫలితం శూన్యం
- ఓ మిల్లర్‌ పోరాటంతో.. కోర్టు ఆదేశాల మేరకు కేసు పెట్టి వదిలేశారు
- సీఎంఆర్‌ ధాన్యం రికవరీలో ఉన్నతాధికారుల అధికార దుర్వినియోగం
- నిజామాబాద్‌ జిల్లాలో రూ.250 కోట్లు.. కామారెడ్డి జిల్లాలో రూ.45 కోట్ల విలువైన సీఎంఆర్‌ పెండింగ్‌



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌ : ధాన్యం పండించడంలో, ధాన్యం సేకరణలోనూ జిల్లా నంబర్‌ వన్‌గా నిలిచింది. అదేవిధంగా సీఎంఆర్‌ రికవరీని పెండింగ్‌ పెట్టడంలోనూ మొదటి స్థానంలోనే నిలబెట్టడంపై జిల్లా యంత్రాంగంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటి వరకు జిల్లాకు ఇద్దరు ఇన్‌చార్జి మంత్రులు మారారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న సీతక్క సీఎంఆర్‌ రికవరీ విషయంలో చర్యలకు దిగాలని ఉమ్మడి జిల్లా అధికారులను ఆదేశించినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ.295 కోట్ల మేర మిల్లర్ల నుంచి సీఎంఆర్‌ రికవరీ చేయాల్సి ఉంది. ఈ విషయమై మంత్రులు సమీక్ష సమావేశాల్లో చెప్పినప్పటికీ యంత్రాంగం ఏమాత్రం సీరియస్‌గా తీసుకోకపోతుండడం విశేషం.

■ 2014–15 నుంచి 2022–23 సంవత్సరాలకు సంబంధించి నిజామాబాద్‌ జిల్లాలో 44 మిల్లుల నుంచి రూ.250 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 49 మిల్లుల నుంచి రూ.45 కోట్ల విలువజేసే సీఎంఆర్‌ రికవరీ చేయాల్సి ఉంది. ఇందులో బోధన్‌ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ నుంచి రావాల్సిందే రూ.60 కోట్ల మేర ఉండడం గమనార్హం. ఇందుకు సంబంధించి గతంలో సమీక్షలో మంత్రి జూపల్లి ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లవుతున్నప్పటికీ రికవరీ చేయకుండా నోటీసులిచ్చి వదిలేయడమేమిటంటూ అసహనం వ్యక్తం చేశారు. షెడ్యూల్‌, యాక్షన్‌ ప్లాన్‌ రూపొందించుకుని కేసుల మీద కేసులు పెట్టి తక్షణమే రికవరీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా యాక్షన్‌ ప్లాన్‌ తయారు చేసుకుని అడ్వొకేట్‌ జనరల్‌తో కలిసి హైదరాబాద్‌లో సమీక్షకు రావాలని ఆదేశించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు.

■ 2021–22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్లకు గాను షకీల్‌కు చెందిన రహీల్‌, రాస్‌, అమీర్‌, దాన్విక్‌ అనే మిల్లుల పేరిట 50 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఈ మిల్లుల్లో ఒక్క గింజ ధాన్యం కూడా మిల్లింగ్‌ చేయలేదు. నేరుగా ధాన్యాన్ని అక్రమ మార్గంలో ముంబయి, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నాడు. కేవలం 5వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యానికి ఇచ్చేంత పరిమాణంలో రీసైకిల్‌ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇచ్చాడు. 10 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని మాత్రం ఏఆర్‌ ఇండస్ట్రీస్‌ (ఎడపల్లి), ఆర్‌కాం ఇండస్ట్రీస్‌ (వర్ని), అబ్దుల్‌ ఐ ఇండస్ట్రీస్‌ (ఎడపల్లి), ఎఫ్‌టీఎఫ్‌ ఇండస్ట్రీస్‌ (బోధన్‌)కు ఇచ్చినట్లు చూపించాడు. ఈ నాలుగు మిల్లుల యజమానులతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బలవంతంగా ధాన్యం తీసుకున్నట్లు లేఖలు ఇప్పించాడు. షకీల్‌ ఒత్తిడితోనే లేఖలు ఇచ్చినట్లు సదరు మిల్లర్లు తెలిపారు. రూ.60 కోట్ల విలువ చేసే ధాన్యానికి బియ్యం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం షకీల్‌కు చెందిన మిల్లులకు రూ.10 కోట్ల జరిమానా వేసింది. ఇప్పటివరకు కస్టమ్‌ మిల్లింగ్‌ రైస్‌ ఇవ్వకపోవడంతోపాటు, జరిమానా సైతం కట్టలేదు. నోటీసులు ఇచ్చామని చెబుతూ అధికారులు కాలం గడిపారు. మరోవైపు బాధితుడు కిషోర్‌ సంతకాన్ని ఫోర్జరీ చేసే కథ నడిపిన అధికారులే, సీఎంఆర్‌ సైతం కిషోరే ఇవ్వాలంటూ ఒత్తిడి చేయడం గమనార్హం. ఇన్‌చార్జి మంత్రులుగా జూపల్లి, సీతక్క ఆదేశించినప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలే దు. ఈ విషయమై అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌ చేయగా స్పందించలేదు.

కేసులు నమోదు చేశారు.. విచారణ వదిలేశారు..

సీఎంఆర్‌ రికవరీలో ఉన్నతాధికారులే అధికార దుర్వినియోగానికి పాల్పడిన వ్యవహారంలో గత మార్చి 30న బాధితుడి పోరాటంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రస్తుతం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న, గతంలో నిజామాబాద్‌ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్‌, మాజీ డీఎస్‌వో చంద్రప్రకాష్‌, డిప్యూటీ తహసీల్దార్‌ నిఖిల్‌రాజ్‌లపై వర్ని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 2022–23 సీజన్‌లో వర్ని మండలంలోని కిషోర్‌ అనే వ్యక్తికి చెందిన శ్రీనివాస రైస్‌మిల్లుకు కేటాయించిన ధాన్యం పంపించకుండానే పంపించినట్లు చూపించిన ఉన్నతాధికారులే, సదరు రైస్‌మిల్లు యజమాని సంతకాన్ని సైతం ఫోర్జరీ చేయించడం విశేషం. ధాన్యం మాత్రం మాజీ ఎమ్మెల్యే షకీల్‌ మిల్లుకు పంపించి, కస్టమ్‌ మిల్లింగ్‌ రైస్‌ను కిషోర్‌కు చెందిన శ్రీనివాస రైస్‌ మిల్లు నుంచి ఇవ్వాలని ఈ ఉన్నతాధికారులే ఒత్తిడి తేవడం గమనార్హం. దీంతో దిక్కుతోచని బాధితుడు కిషోర్‌ నెలల తరబడి న్యాయపోరాటం చేయాల్సి వచ్చింది. కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా సదరు అధికారులను పోలీసులు ప్రశ్నించకపోవడం విశేషం. కాలయాపన చేస్తే చాలు అన్నట్లుగా యంత్రాంగం వ్యవహరిస్తోందని అధికార కాంగ్రెస్‌ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు వాటాలు ముట్టినట్లు కాంగ్రెస్‌ నాయకులు ఆరోపిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బోధన్‌ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ ఇష్టం వచ్చినట్లు దందా చేశాడు. మళ్లీ అధికారంలోకి వస్తామనే అతినమ్మకంతో ధాన్యం ఇవ్వకుండానే కిషోర్‌ మిల్లు నుంచి సీఎంఆర్‌ ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేయించడం గమనార్హం.

స్థానికంలో క్లీన్‌ స్వీప్‌ చేయాలి

- ఏ సమస్య ఉన్నా ఇన్‌చార్జి మంత్రికి చెప్పండి
- పనులు పూర్తయ్యేలా చూస్తా
- ఆర్మూర్‌ నియోజకవర్గ సమీక్షలో టీపీసీసీ చీఫ్‌ మహేశ్‌గౌడ్‌



ఆర్మూర్‌ నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్‌ మహేశ్‌గౌడ్‌

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌ స్వీప్‌ చేసే విధంగా పని చేయాలని ఆర్మూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ శ్రేణులకు పీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌ సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం ఆర్మూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డితోపాటు నాయకులతో పీసీసీ చీఫ్‌ సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి సర్పంచ్‌, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను పూర్తిగా గెలిచేలా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ఆర్మూర్‌ను తన సొంత నియోజకవర్గంలాగా చూసుకుంటానన్నారు. ఏ సమస్య ఉన్నా కలిసి పరిష్కరించుకుందామన్నారు. ప్రజాసమస్యలను ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్తే తానే వెంట ఉండి పనులను చేస్తానన్నారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోనే ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌కు త్వరంలోనే సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయాలి



ఆలూర్‌ పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి

- గర్భిణులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు
- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి
- ఆలూర్‌ మండలంలో ఆకస్మిక తనిఖీలు
- భూభారతి దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో సమీక్ష

ఆర్మూర్‌: గర్భిణులకు అవగాహన కల్పిస్తూ స్థానికంగానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయాలని కలెక్టర్‌ టీ.వినయ్‌ కృష్ణారెడ్డి మెడికల్‌ ఆఫీసర్లకు సూచించారు. ఆలూరు మండలంలో కలెక్టర్‌ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జెడ్పీ హై స్కూల్‌, పీహెచ్‌సీ, సొసైటీ గోదాం, తహసీల్‌ కార్యాలయాలను సందర్శించారు. ముందుగా కల్లడిలోని పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్‌ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను, అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను పరిశీలించారు. గర్భిణుల వివరాలు నమోదు చేయడంతోపాటు వారికి క్రమం తప్పకుండా నిర్వహించేలా పర్యవేక్షించాలన్నారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి సిబ్బందితోపాటు విద్యార్థుల హాజరును ఫేస్‌ రికగ్నిషన్‌ విధానం ద్వారా చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. సహకార సొసైటీ గోదాములో ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, స్టాక్‌ మిగిలి ఉన్నప్పుడే, మళ్లీ స్టాక్‌ తెప్పించుకోవా లని గోదాం బాధ్యులకు సూచించారు.

గ్రామంలో నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం, పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ చర్యల వివరాలను పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆలూరు తహసీల్‌ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులపై గ్రామాల వారీగా సమీక్షించారు. అనంతరం పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్‌ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఇంజినీరింగ్‌ విభాగం అధికారులకు సూచించారు. కలెక్టర్‌ వెంట ఎంపీడీవో ఎం.గంగాధర్‌, స్థానిక అధికారులు ఉన్నారు.

గట్టెక్కించిన బఫర్‌ స్టాక్‌

- జిల్లాలో యూరియా కొరత తలెత్తకపోవడానికి కారణం అదే..
- ఎప్పటికప్పుడు తెప్పించిన వ్యవసాయ శాఖ
- అధికారుల ముందుచూపుతో తప్పిన గండం
- ఇంకా 290 పాయింట్లలో అందుబాటులో ఉన్న స్టాక్‌



బుధవారం ఆలూర్‌ సొసైటీ గోదాములో స్టాక్‌ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ప్రస్తుతం రాష్ట్రమంతా యూరియా లొల్లి నడుస్తోంది. వరంగల్‌, ఖమ్మం, మెదక్‌, మహబూబ్‌నగర్‌, రంగారెడ్డి వంటి జిల్లాల్లో కొరత తీవ్రంగా ఉండడంతో అక్కడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే వ్యవసాయ ఆధారిత జిల్లాగా గుర్తింపు ఉన్న మన జిల్లాలో మాత్రం అలాంటి పరిస్థితులు ఇప్పటి వరకు తలెత్తకపోవడానికి కారణం అధికారుల ముందు చూపేనని చెప్పొచ్చు. వానాకాలం సీజన్‌కు ముందుగానే జిల్లాలో అందుబాటులో ఉంచిన 9వేల మెట్రిక్‌ టన్నుల బఫర్‌ స్టాక్‌ (యూరియా) గండం నుంచి గట్టెక్కించింది. వ్యవసాయ శాఖతోపాటు కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం, రోజువారీగా పరిస్థితిని సమీక్షించి అవసరమైన ప్రాంతాలకు యూరియా తెప్పించి రైతులకు అందేలా చూశారు. ప్రజాప్రతినిధులు కూడా వారివంతు కృషి చేశారు. గ్రామగ్రామానా సొసైటీ గోదాములు ఉండడంతో రవాణాకు రైతులు ఇబ్బందులు పడలేదు. ప్రస్తుతం జిల్లాలో వరినాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఆర్మూర్‌, బాల్కొండ, నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గాల్లో అక్కడక్కడ మాత్రమే కొంతమేర నాట్లు పడే అవకాశం ఉండడంతో ఆ ప్రాంతాల సొసైటీల్లో యూరియా స్టాక్‌ను ఉంచారు. ఇటు రైతులు బస్తాల్లోని యూరియా తగ్గించి ద్రవ రూపంలో ఉండే నానో యూరియా వాడే విధంగా వ్యవసాయాధికారులు చేసిన ప్రయత్నాలు కొంతమేర ఫలించాయని చెప్పొచ్చు.

వచ్చింది వచ్చినట్లుగా..

జిల్లాలో ఈ సీజన్‌లో 5,24,506 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి 4,36,700 ఎకరాల్లో, మొక్కజొన్న 52,093 ఎకరాల్లో, సోయా 33,603 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. అయితే జిల్లాకు తెప్పించిన యూరియా వచ్చింది వచ్చినట్లుగా అమ్ముడైంది. కొరత వస్తుందేమోనని రైతులు పంటకు అవసరమయ్యే మూడు దఫాల యూరియాను ఒకేసారి తీసుకెళ్లి ఇళ్లలో, గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. దీంతో రైతులకు మళ్లీ యూరియా అవసరం లేకుండా పోయింది. శాస్త్రీయంగా వేయాల్సిన ఎరువులు ఎకరానికి ఒకటి, రెండు బస్తాలు ఎక్కువగా వేయడంతో రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. ఈ అమ్మకాలపై జిల్లా యంత్రాంగం కూడా నిఘా పెట్టింది. ప్రభుత్వం రాయితీపై అందించే యూరియాను వ్యవసాయేతర పనులకు వాడుతున్నారా? అనే అనుమానంతో అధికారులు పలు పరిశ్రమల్లో తనిఖీలు చేశారు.

జిల్లాకు అవసరమైన యూరియా	75 వేల మెట్రిక్‌ టన్నులు
ఇప్పటి వరకు వచ్చింది	67,529 మె.ట.
రైతులు కొనుగోలు చేసింది	62,254 మె.ట.
అందుబాటులో ఉన్న స్టాక్‌	5,275 మె.ట.

పరిస్థితులను అధిగమించాం



జిల్లాలో యూరియా కొరత వంటి పరిస్థితులు రాకపోవడం అదృష్టం. రాష్ట్ర ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్‌ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి జిల్లాకు యూరియాను తెప్పించారు. రైతులకు అవసరం మేరకు అందించాం. బఫర్‌ స్టాక్‌ చాలా వరకు మేలు చేసింది. జిల్లాలో ఇంకా 5వేల మెట్రిక్‌ టన్నులకు పైగా యూరియా నిల్వలున్నాయి. సరిపోకపోతే ఇంకా తెప్పిస్తాం. – మేకల గోవింద్‌, డీఏవో

దరఖాస్తులకు వేళాయే..!

- వైన్‌ షాపులకు నవంబర్‌తో ముగియనున్న గడువు
- జిల్లాలో 102 మద్యం దుకాణాలు
- ఈ సారి రూ.3 లక్షలకు పెరగనున్న దరఖాస్తు ఫీజు
- ఒక దుకాణానికి ఒకరు ఎన్ని దరఖాస్తులైనా వేసే అవకాశం
- వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం
- 5 వేల దరఖాస్తులు అందొచ్చని ఎక్సైజ్‌ వర్గాల అంచనా



ఖలీల్‌వాడి: మద్యం దుకాణాల టెండర్లు అంటేనే అదో రకమైన సందడి. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి దండి ఆదాయం. 2023 డిసెంబర్‌ 1న ప్రారంభమైన వైన్‌షాపుల గడువు ముగియనుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వారంలో దరఖాస్తులను పిలిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఎక్సైజ్‌ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే ఎక్సైజ్‌ కమిషనరేట్‌ జిల్లాలోని వైన్స్‌షాపులకు సంబంధించిన వివరాలను సేకరించింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టెండర్లు ఆలస్యమవుతాయని భావించినప్పటికీ దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇస్తున్నట్లు తెలిసింది. టెండర్లకు సంబంధించిన జీవోను సిద్ధం చేసినప్పటికీ ఇప్పటి వరకు అధికారికంగా అందలేదని ఎక్సైజ్‌ వర్గాల ద్వారా తెలిసింది. దీనిపై వారం రోజుల్లో పూర్తి స్పష్టత వస్తుందని, వచ్చిన తర్వాత దరఖాస్తులు స్వీకరణకు తేదీలు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డి తెలిపారు. 2023 ఆగస్టు 4వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి అదే నెల 22వ తేదీన లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించారు. లైసెన్సులు నవంబర్‌లో జారీ చేయగా, కొత్త దుకాణాలు డిసెంబర్‌ 1 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది సైతం డిసెంబర్‌ 1 నుంచి కొత్త దుకాణాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

2023లో దరఖాస్తు ఫారానికి రూ. 2 లక్షల ఫీజు వసూలు చేయగా, గతంలో 4 వేల దరఖాస్తులకు గాను ఎక్సైజ్‌శాఖకు రూ.80కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలకు పెరిగింది. అయితే ఒక దరఖాస్తుదారు ఒక దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా వేసే అవకాశం ఉంది. ఈసారి 5 వేలకు పైగా దరఖాస్తులు అందుతాయని ఎక్సైజ్‌ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బీర్లు, వీస్కీ ధరలు పెంపు

రాష్ట్ర ప్రభుత్వం బీర్లపై రూ.30 చొప్పున, వీస్కీ క్వార్టర్‌కు రూ.10, హాఫ్‌ బాటిల్‌పై రూ.20, ఫుల్‌ బాటిల్‌పై రూ.40 పెంచింది. ధరలు పెరగక ముందు మద్యం విక్రయాల ద్వారా జిల్లా ఎక్సైజ్‌కు రూ.90 కోట్ల వరకు నెలకు ఆదాయం సమకూరేది. ధరల పెంపుతో జూలై నెలలో రూ.111 కోట్ల ఆదాయం వచ్చింది. ధరల పెంపుతో ఎక్సైజ్‌కు రూ. 20 కోట్ల ఆదాయం అదనంగా సమకూరుతున్నట్లు ఎక్సైజ్‌ వర్గాల ద్వారా తెలిసింది.

రిజర్వేషన్లు, శ్లాబ్‌లు..

జిల్లాలో 102 వైన్‌ షాపులు ఉండగా రిజర్వేషన్లు కేటాయించారు. గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్‌ ఉంటుంది. ఈ షాపులను ఆరు శ్లాబ్‌లలో విభజించనున్నారు. 5 వేల జనాభా వరకు రూ.50 లక్షల లైసెన్స్‌ ఫీజు, 5 వేల నుంచి 50 వేల జనాభా ఉంటే రూ.55 లక్షలు, లక్ష జనాభా ఉంటే 60 లక్షలు, లక్ష నుంచి 5 లక్షల వరకు ఉంటే రూ.65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల జనాభా ఉంటే రూ.85 లక్షలుగా నిర్ణయించారు. లాటరీ పద్ధతి ద్వారా 24 నెలల లైసెన్స్‌కు నాలుగో వంతు ఎక్సైజ్‌శాఖకు బ్యాంక్‌ గ్యారెంటీని చూపించాల్సి ఉంటుంది. మద్యం దుకాణాల్లో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటాయి.

విద్యుత్‌ లైన్‌ల ఎత్తు పెంచాలి

- విగ్రహాల తరలింపు రూట్‌లో తీగలు తగలకుండా జాగ్రత్తలు

సుభాష్‌నగర్‌: వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్‌ లైన్ల ఎత్తు పెంచాలని టీజీఎస్‌పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. వరంగల్‌లోని కార్యాలయం నుంచి బుధవారం 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. వినాయక విగ్రహాలు తరలించే రూట్‌లలో విద్యుత్‌ నెట్‌వర్క్‌పరంగా లోపాలు లేకుండా చూడాలని సూచించారు. మండపాల్లో విద్యుత్‌ వాడకం సమయంలో అప్రమత్తంగా ఉండాలని గణేశ్‌ మండళ్ల బాధ్యులను కోరారు. డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, మధుసూదన్‌, సీజీఎం అశోక్‌, జీఎం సురేందర్‌ పాల్గొన్నారు.

వీసీ అనంతరం ఎస్‌ఈ రాపల్లి రవీందర్‌ మాట్లాడుతూ.. విద్యుత్‌ ప్రమాదాలకు కేబుల్‌ వైర్లు కారణం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కేబుల్‌ వైర్లు రీ అలైన్‌మెంట్‌ చేసుకోవాలని లేనిపక్షంలో తొలగించాలని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో 1912కు గానీ.. ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌కు కాల్‌ చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఎస్‌ఈ చేసిన సూచనలివే..

- విగ్రహాల ఎత్తును బట్టి రూట్‌ను నిర్ణయించుకోవాలి. ఎక్కడైనా సమస్య ఉంటే విద్యుత్‌ సిబ్బందికి సమాచారం అందించాలి.
- విద్యుత్‌ లైన్ల నుంచి కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి.
- ఎత్తైన మెటల్‌ విగ్రహాల తరలించేప్పుడు అప్రమత్తంగా ఉండాలి.
- మెటల్‌ ఫ్రేమ్‌లతో కూడిన డెకొరేషన్‌లను వీలైనంత మేరకు తగ్గించాలి.
- మండపాలకు విద్యుత్‌ కనెక్షన్‌ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కొద్దు. సంస్థ సిబ్బంది ద్వారానే విద్యుత్‌ కనెక్షన్‌ పొందాలి.
- ఐఎస్‌ఐ మార్క్‌ ఉన్న వైర్లను మాత్రమే వాడాలి. వైర్లకు జాయింట్‌లు ఉండొద్దు.
- విద్యుత్‌ షాక్‌కు గురైన వారికి వెంటనే వైద్య సహాయం అందించాలి.
- మండప నిర్వాహకులు ప్రతిరోజు తప్పనిసరిగా వైరింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి.

క్లుప్తంగా

కొనసాగుతున్న పీజీ, బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. మొత్తం ఏడు పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 2,366 మంది విద్యార్థులకు 2,240 మంది హాజరుకాగా 126 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన బీఈడీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 1,444 మంది విద్యార్థులకు 1,379 మంది హాజరుకాగా 65 మంది గైర్హాజరైనట్లు చంద్రశేఖర్ తెలిపారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



నిజామాబాద్‌నాగారం: దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని దుబ్బా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుకారాం రాథోడ్ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, మెదడువాపు లాంటి వ్యాధులను నివారించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హజ్మతున్నీసా బేగం, శిఖర, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, హెచ్‌ఈవోలు నటరాజ్ గోవర్ధన్, లింబారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత



మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన బొద్దుల వరుణ్‌ను ఆయన తాత వడ్డేపల్లి గంగాధర్‌కు ఎస్సై జాడె సుస్మిత బుధవారం అప్పగించారు. వరుణ్ అదృశ్యమయ్యాడని గంగాధర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలించారు. నిజామాబాద్ బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాల్లో తిరుగుతున్నట్లు గుర్తించిన రైల్వే పోలీసులు వరుణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించి మోపాల్ పోలీసులకు అప్పగించారు. అనంతరం మోపాల్ పోలీసులు వరుణ్‌ను ఆయన కుటుంబసభ్యులకు బుధవారం అప్పజెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. బాల్కొండ, ఆలూరు, ధర్మపురి హిల్స్, కోటగిరి గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎంఏ, బీఈడీ అర్హత ఉండాలని తెలిపారు. ఈ నెల 23వ తేదీలోపు నాగారంలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని వివరించారు. పూర్తి వివరాలకు 9849419469 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య హితవు
- వినాయక చవితి, మిలాద్–ఉన్–నబీ నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్: వినాయక చవితి, మిలాద్–ఉన్–నబీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకొని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ సాయి చైతన్య సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డుగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడతామన్నారు. ప్రతి సంవత్సరం సహృద్భావ వాతావరణంలో వేడుకలు జరుగుతాయని, ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఉత్సవాలు జరుపుకొని జిల్లా ప్రతిష్టను పెంపొందించాలని కోరారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ శబ్దాలతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున మంటపాల వద్ద డీజే సౌండ్లను నిషేధించినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువులు, గోదావరి పరీవాహక ప్రాంతాల వద్ద సరిపడా సంఖ్యలో క్రేన్‌లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిజ్ఞాన్ , ట్రెయినీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రవిబాబు, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై పటిష్ట నిఘా..

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై పటిష్ట నిఘా ఉంచామని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. మాదకద్రవ్యాల విక్రేతలు, రవాణా చేసే వారిపై పీడీ యాక్టును ప్రయోగించేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్పరిణామాలపై ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. 'డ్రగ్ అఫెండర్స్ ప్రొఫైలింగ్ ఎనాలిసిస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (డోపమ్)' పోర్టల్ ద్వారా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను రవాణా చేసే వారిని, వాటిని విక్రయిస్తున్న, వినియోగిస్తున్న వారిని పక్కాగా గుర్తిస్తూ నిఘా కొనసాగిస్తున్నామని సీపీ సాయిచైతన్య స్పష్టం చేశారు. ఈ పోర్టల్ సహాయంతో ఇప్పటికే పలువురిని అరెస్టు చేశామని, ఇకపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇదోరకం మోసం.. 'కారు'చౌక బేరం..

- అద్దెకు తెచ్చి.. ఫేక్ నంబర్ తయారుచేసి.. తక్కువ ధరకు విక్రయం
- ఆపై అదే కారును చోరీ చేసి.. యజమానికి అప్పగిస్తున్న వైనం
- ఆరుగురు నిందితుల అరెస్ట్, పరారీలో మరొకరు



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి క్రైం: మోసగాళ్లు తెలివిమీరుతున్నారు. కార్లను అద్దెకు తీసుకుని, ఫేక్ నంబర్లు, ఆర్సీ తయారు చేసి ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నారు. అదే కారును తస్కరించి, తిరిగి యజమానులకు అప్పగిస్తున్నారు. ఈ ముఠాను మాచారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఉప్పల్వాయి ప్రశాంత్ గౌడ్ ఫేస్‌బుక్ అప్లికేషన్‌లో చూసి సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేశాడు. ఆ మరుసటి రోజు ఓ వ్యక్తి వచ్చి అది తన కారని చెప్పి తీసుకుపోయాడు. కారు విక్రయించిన వ్యక్తులకు ఫోన్ చేయగా.. అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన గతనెల 7వ తేదీన మాచారెడ్డి పీఎస్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరుపగా కొత్త రకం మోసం వెలుగు చూసింది.

ముఠాగా ఏర్పడి..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపీనగర్‌కు చెందిన మహమ్మద్ ఇయాజ్, వికారాబాద్‌లోని ఆలంపల్లికి చెందిన మహమ్మద్ జాహీద్ అలీ, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన పృథ్వి జగదీష్, రాచర్ల శివకృష్ణ, వేములవాడకు చెందిన వివేక్, శేరిలింగంపల్లి మండలానికి చెందిన కర్ణకోట సాకేత్, అలీ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు ముందుగా ట్రావెల్స్ సంస్థల నుంచి వ్యక్తిగతంగా ఇచ్చే సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను అద్దెకు తీసుకుంటారు. వాటి నంబర్ ప్లేట్‌లు మార్చేసి నకిలీ ఆర్సీ, ఇతర పత్రాలు సృష్టిస్తారు. ఆపై ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో కారు అమ్మకానికి ఉందని పెట్టి, తక్కువ ధరకే వాటిని అమ్మనున్నట్లు పేర్కొంటారు. కారును అమ్మేటప్పుడు దాంట్లో జీపీఎస్ ట్రాకర్‌ను అమరుస్తారు. దీంతో కారు ఎక్కడుందో వారికి తెలిసిపోతుంది. కారున్న చోటుకు వెళ్లి రాత్రికి రాత్రి వారు విక్రయించిన కారునే చోరీ చేసి తీసుకువచ్చి అసలు యజమానికి అప్పగిస్తున్నారు. అలా వీలు కాని సందర్భాల్లో ఇతరులను పంపి కారు మాది అంటూ బెదిరింపులకు పాల్పడి ఎత్తుకొస్తున్నారు.

నిందితులపై పలు కేసులు..

నిందితులు గతంలోనూ పలు చోట్ల నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. మాచారెడ్డిలో కేసు నమోదైన నాటి నుంచి పరారీలో ఉన్న వారిలో ఆరుగురిని అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు అలీ ఇంకా పరారీలో ఉన్నాడన్నారు. నిందితుల నుంచి మూడు కార్లు, 15 సెల్‌ఫోన్‌లు, జీపీఎస్ పరికరాలు, ల్యాప్‌టాప్, 10 మైక్రో సిమ్‌కార్డులు, చిప్ కార్డులు, ఫోర్జరీ చేసిన ఆర్‌సీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన రూరల్ సీఐ రామన్, ఎస్సై అనిల్, ఐటీ సెల్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది సుభాష్‌రెడ్డి, సిద్ధిరాములు, శ్రీకాంత్‌లను అభినందించారు. సమావేశంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'ప్రో కబడ్డీ చాంపియన్' శిబిరం ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చీఫ్ కోచ్ ప్రశాంత్

బాల్కొండ: యువ తెలంగాణ ప్రో కబడ్డీ చాంపియన్– 2025 క్యాంపు బుధవారం ముప్కాల్ భుదేవ్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ మాట్లాడుతూ ప్రో కబడ్డీ లీగ్‌లో ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయని, అందులో 'శాతవాహన సైనిక్' జట్టును జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. జట్టు క్రీడాకారులకు భుదేవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 25వ తేదీ వరకు చీఫ్ కోచ్ ప్రశాంత్ శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల నిర్వహణ అధికారి పవన్ కుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గంగారెడ్డి, ముస్కు భూమేశ్వర్, బద్దం నర్సారెడ్డి, ముస్కు మోహన్, ఎస్.అంజయ్య, పీడీ రాజ్‌కుమార్, పీఈటీ అన్వేష్, టీ సాయన్న, గోపీనాథ్, రఫీ, ముఖీద్, పోశెట్టి, గైని రమేశ్, గౌరై రాములు తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియాన్ని ఆధునీకరిస్తాం

ఆర్మూర్‌టౌన్: క్రీడాకారులకు అనుగుణంగా మినీ స్టేడియాన్ని అన్ని విధాల ఆధునీకరిస్తామని జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మినీ, ఇండోర్ స్టేడియాలను ఆయన బుధవారం పరిశీలించారు. త్వరలోనే క్రీడా మైదానాలను అందంగా తీర్చిదిద్దుతామన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ప్లే ఫీల్డ్‌లని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట సీనియర్ పీడీ గోపిరెడ్డి, మల్లేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

బాన్సువాడ రూరల్: మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలను బ్యాడ్‌టచ్ చేస్తూ వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై బుధవారం పోక్సో కేసు నమోదైంది. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు కొన్నిరోజులుగా శారీరకంగా వేధిస్తుండంతో విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో చైల్డ్ ప్రొటెక్షన్ జిల్లా అధికారి స్రవంతి, బాన్సువాడ ఎంఈవో నాగేశ్వరరావులు బుధవారం పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు నిర్ధారించి పోలీసులు, ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దీంతో బాన్సువాడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలే ఈ పాఠశాలలో జరిగిన కంప్యూటర్ల చోరీలోనూ సదరు ఉపాధ్యాయుడి హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

జక్రాన్‌పల్లి వీడీసీ భవనంపై గ్రామస్తుల ఫిర్యాదు

- విచారణకు ఆదేశించిన న్యాయసేవా సంస్థ



జక్రాన్‌పల్లిలో వీడీసీ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

నిజామాబాద్ లీగల్: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, అద్దె వసూలు చేసుకుంటున్న వీడీసీపై న్యాయసేవా సంస్థకు గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో సంస్థ కార్యదర్శి ఉదయభాస్కర్ రావు గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌ను విచారణకు ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో 1982–87 పంచాయతీ పాలకవర్గం బీఎస్‌ఎన్‌ఎల్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించింది. 2020–21లో వీడీసీ ఆ స్థలాన్ని కబ్జా చేసి అనుమతి లేకుండా 8 మడిగెలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించింది. మడిగెలను వైన్స్, పర్మిట్‌రూంలకు అద్దెకు ఇచ్చి డబ్బులను వీడీసీ వసూలు చేస్తోంది. ఐతే, మడిగెలు నిర్మించిన స్థలం ప్రభుత్వానిదా లేక ప్రైవేటు వ్యక్తులదా? తేల్చాలని, నిర్మాణాలకు జీపీ అనుమతులపై న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఉదయభాస్కర్ రావు విచారణకు ఆదేశించారు. పర్మిట్ రూంలతో మహిళలు ఇబ్బంది పడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ రావుకు సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

I, NOORA, D/o. ABDUL AZEEM, R/o. H.No. 3-107, JP Colony, Mupkall (V & M), Nzb (D) have Changed my Name as SHAIK NOORA, D/o. ABDUL AZEEM.
[SCA25007453]

I, MOHAMMED, S/o.ABDUL AZEEM, R/o. H.No. 3-107, JP Colony, Mupkall (V&M), Nzb (D) have Changed my Name as SHAIK MOHAMMED, S/o. ABDUL AZEEM
[SCA25007454]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
Contact: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో పాల్వంచ వాసి మృతి



వెంకటి మృతదేహం

మాచారెడ్డి: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం పాల్వంచ మర్రి గ్రామానికి చెందిన కడమంచి వెంకటి(57)మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటి తన బైక్‌పై పని మీద సిరిసిల్ల జిల్లా సముద్ర లింగాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా పెద్దమ్మ స్టేజి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారుడ్రైవర్ అతివేగంతో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు వెంకటి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపారు.

అదృశ్యమైన మహిళ శవం లభ్యం



చిన్నక్క (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి కిందిపల్లెకు చెందిన ఇరగదిండ్ల చిన్నక్క(42) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. ఈ నెల 5న చిన్నక్క అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. బుధవారం రాంపల్లి అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మహిళ మృతదేహం కుళ్లిపోయినట్లు తెలిపారు. మృతురాలిని హత్య చేసినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తూ విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి మృతికి కారణమైన నిందితుడికి 9 నెలల జైలు

కామారెడ్డి క్రైం: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన నిందితుడికి కామారెడ్డి కోర్టు 9 నెలల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూర్‌కు చెందిన జమ్మగౌని పోట్ల ముత్తాగౌడ్ తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా బోయిని స్వామి అనే వ్యక్తి తన ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ముత్తా గౌడ్ మరుసటి రోజు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ స్వామిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సాక్ష్యాలను పరిశీలించిన ప్రత్యేక మొబైల్ కోర్టు 2024 ఏప్రిల్ 4 న నిందితుడికి 9 నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. అనంతరం నిందితుడు జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకున్నాడు. బుధవారం కేసును పరిశీలించిన జిల్లా జడ్జి వరప్రసాద్ గతేడాది ప్రత్యేక మొబైల్ కోర్టు ఇచ్చిన తీర్పు సరైనదేనని భావిస్తూ తీర్పునిచ్చారు. కేసును సరైన పద్ధతిలో విచారణ చేసి పకడ్బందీ ఆధారాలతో కోర్టులో అభియోగపత్రం వేసి నిందితునికి శిక్షపడేలా కృషి చేసిన ఎస్సై రాజు, పోలీసుఅధికారులను ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

బీమా డబ్బుల కోసం కన్న తల్లి దారుణ హత్య

- ఏడు నెలల తర్వాత వెలుగు చూసిన ఘటన

నాగిరెడ్డిపేట (ఎల్లారెడ్డి): బీమా డబ్బుల కోసం కన్న కొడుకే తల్లిని హతమార్చిన ఘటన సుమారు ఏడు నెలల తర్వాత వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలను నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ బుధవారం రాత్రి మీడియాకు తెలిపారు. జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన చాకలి రాజు తన తల్లి జమునను గత జనవరి 9న హతమార్చాడు. జమున బహిర్భూమి కోసం ఆరుబయటకు వెళ్లగా రాజు వెనక నుంచి వెళ్లి బండరాయి పై తోసి తలకు గాయం చేసి హతమార్చాడు. జమున బహిర్భూమికి వెళ్లి కాలుజారి బండపైపడి మృతి చెందినట్లు గ్రామస్తులను, పోలీసులను నమ్మించాడు. ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్‌గేట్ వద్ద జరిగిన ఓ హత్యాయత్నం కేసులో చాకలి రాజుతో పాటు ఓ మహిళ, మరో ఇద్దరు నిందితులు, మైనర్ బాలుడిని గత నెల 29న పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యాయత్నం కేసుకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం చాకలి రాజు తోపాటు మహిళ, ఇద్దరు నిందితులను ఈ నెల 18న పోలీసులు పీటీ వారెంట్‌పై కస్టడీలోకి తీసుకొని విచారించారు. పోలీసులు చేపట్టిన విచారణలో చాకలి రాజు తల్లి జమున హత్య విషయం బయట పడింది. జమున పేరుమీద రాజు రూ.80 లక్షల విలువ చేసే ఆరు ఇన్సూరెన్స్ పాలసీలు చేయించాడు. తల్లి పేరున ఉన్న ఇన్సూరెన్స్ డబ్బులను కాజేసేందుకు జమునను హత్య చేసినట్లు రాజు తమ విచారణలో అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. రాజుతో పాటు హత్యాయత్నం కేసులోని నిందితులను కోర్టులో హాజరుపర్చామని ఆయన చెప్పారు.

ఆగస్టులోనే పూసే 'అగ్ని శిఖ' పుష్పం

మీకు తెలుసా?



దత్తాపూర్ శివారులో పూసిన అగ్ని శిఖ పుష్పాలు

వేసవిలో పూసే 'మే' పుష్పం మాదిరిగా ఆగస్టు మాసంలోనే పూసే మరో రకం పుష్పం ఉంది. దాని పేరే అగ్ని శిఖ (కలంగటి పువ్వు). దీనికి 'గ్లోరీ లిల్లి' అనే మరో శాస్త్రీయ నామం కూడా ఉంది. ఇది 'కొల్చికేసియే' అనే కుటుంబానికి చెందిన మొక్క. మొత్తం 11 రకాల జాతుల్లో 'అగ్ని శిఖ' ఒకటి.

- ఇది భారతదేశంతోపాటు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల్లో అలాగే సముద్రపు, అటవీ ప్రాంతాలు, చెట్ల పొదల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఇవి వర్షాకాలంలో రుతుపవనాలకు అనుకూలంగా ఉండి పుష్పాలు పూస్తాయి.
- ఇది తమిళనాడు రాష్ట్ర పుష్పం కూడా. మొక్క మూడు మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. దీని పూలు ఆకుపచ్చ, పసుపు, నారింజ, ఎరుపు, ముదురు గులాబీ రంగుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- వినాయక చవితి పండుగకు ముందు ఇవి భారీగా వికసిస్తాయి. అందుకే వీటిని 'ఎంకయ్య పువ్వు' అని కూడా అంటారు. చవితి రోజు గణపతిని ఈ పుష్పాలతో ప్రత్యేకంగా పూజిస్తారు. ఎడ్ల పొలాల అమావాస్య నాడు కూడా వీటిని రైతులు పూజకు ఉపయోగిస్తారు. ఇలా చేయడం పెద్దల కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది.
- పవిత్రంగా భావించే ఈ మొక్కను విషపూరితమైనదిగా పరిగణిస్తారు. మనుషులు, పశువులు తినకూడదంటారు. కానీ, దీనిని ఆర్థ రైటిస్, అల్సర్, కు ష్ఠు, పైల్స్, కడుపునొప్పి, చర్మ సంబంధిత, ఇత ర చాలా రకాల వ్యాధులకు ఉపయోగిస్తారట.

– దొంకేశ్వర్(ఆర్మూర్)

బీజేపీలో కార్యకర్తలకు సముచిత స్థానం

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



మాట్లాడుతున్న పల్లె గంగారెడ్డి

సుభాష్‌నగర్: బీజేపీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో మహాజన సంపర్క్ అభియాన్ జిల్లా సమావేశం పార్టీ అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశానికి పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బూత్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీ అర్వింద్ కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. బలమైన బూత్ ఉంటే సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు గెలవడం సులభమన్నారు. దొంగ ఓట్ల విషయమై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని, ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను ఉద్దేశించి విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, జెడ్పీపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి ఆశాభావం వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద



ప్రాజెక్టుపై పర్యాటకుల సందడి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు తగ్గించారు. బుధవారం ఉదయం నుంచి ప్రాజెక్టులోకి వరద క్రమంగా తగ్గుముఖం పడుతూ సాయంత్రానికి లక్షా 50వేల క్యూసెక్కులకు చేరుకుంది. దీంతో గోదావరిలోకి నీటి విడుదలను తగ్గిస్తూ.. సాయంత్రానికి 16 గేట్ల ద్వారా 52వేల క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉన్నా అవుట్ ఫ్లో మాత్రం తగ్గించి, ప్రాజెక్ట్ నీటిమట్టాన్ని క్రమంగా పెంచుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతుండటంతో సందర్శనకు పర్యాటకులు తరలివచ్చారు. డ్యామ్ పైకి అనుమతులు ఇవ్వడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తూ ఉల్లాసంగా గడిపారు.

కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 20 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3 వేలు, కాకతీయ కాలువ ద్వారా 5వేలు, లక్ష్మి కాలువ ద్వారా 150, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 692 క్యూసెక్కులు పోతుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1088.10 (70.10 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

'సాహిత్యం సమాజ ప్రగతిని నిర్దేశిస్తుంది'



నిజామాబాద్ రూరల్: ఉత్తమమైన సాహిత్యం ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించి పౌరులందరినీ బాధ్యతతో నిలిచేలా చేస్తుందని డీఈవో అశోక్ అన్నారు. బోర్గాం(పి) సమీపంలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం జిల్లా స్థాయి కవి సమ్మేళనం, చింతల శ్రీనివాస గుప్త సంపాదకత్వంలో వెలువడిన 'వేసవి సెలవులు' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ అరుణ్ కుమార్ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో అశోక్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా సాహిత్యరంగంలో ముమ్ముందుకు సాగుతుందన్నారు. నిజామాబాద్ కవులు అన్ని ఉద్యమాలలో ప్రముఖంగా నిలిచి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నారన్నారు. 'వేసవి సెలవులు' పుస్తకంలో 21 మంది ప్రముఖ కవులందరూ కలిసి బాల్యాన్ని చిత్రీకరిస్తూ చక్కటి కవితలు రాశారన్నారు. అనంతరం పుస్తక సంపాదకులు చింతల శ్రీనివాస గుప్తను అభినందించారు. ప్రముఖ కవి, వ్యాఖ్యాత వీపీ చందన్ రావు, కవులు డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, కంకణాల రాజేశ్వర్, స్వర్ణ సమత, వసంతా లక్ష్మణ్, కే రజిత, డాక్టర్ ఏ జ్యోతి, రామ్ నరేశ్, విట్టం ధనుంజయ, ఎలగందుల లింబాద్రి, శంకర్, బట్టు శ్రీధర్ రాజు, రివర్స్ గేర్ నవీన్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ కవితలను వినిపించారు.

ఏటీఎంలో కాలిబూడిదైన రూ.5లక్షలు

- మిగతా నగదును తీసేసిన బ్యాంక్ సిబ్బంది
- దుండగుల కోసం మూడు బృందాలతో పోలీసుల గాలింపు



ధ్వంసం అయిన ఏటీఎం (ఫైల్)

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో దుండగులు ఏటీఎం చోరీకి యత్నించిన కేసులో రూ.5లక్షలకు పైగా నగదు కాలిబూడిదైంది. నగరంలోని చంద్రశేఖర్ కాలనీలోని ఏటీఎంలో మంగళవారం తెల్లవారుజామున చోరీకి యత్నించిన విషయం తెలిసిందే. కేసు ఛేదనలో భాగంగా పోలీసులు విచారణ చేపట్టారు. మారుతీవ్యాన్‌లో వచ్చిన దుండగుల్లో ముగ్గురు ముసుగులు ధరించి ఏటీఎంలోకి చొరబడగా, మరొకరు ఏటీఎం పక్కన మరొకరు సెక్యూరిటీగా ఉన్నట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏటీఎంలోని సీసీ కెమెరాలకు నల్లని రంగును స్ప్రే చేసి, గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది. కాగా, బ్యాంక్ సిబ్బంది బుధవారం ఏటీఎంను పరిశీలించి అందులో ఉన్న నగదును తీసుకెళ్లారు. ఏటీఎం నుంచి ఖాతాదారులు డ్రా చేసిన వివరాలను బ్యాంక్ సిబ్బంది సేకరించినట్లు తెలిసింది. దొంగలు ఏటీఎంలోని నగదును తీసే క్రమంలో కొన్ని నోట్లకు మంటలు అంటుకొని కాలి బూడిదైనట్లు బ్యాంక్ అధికారులు గుర్తించారు. కాలిపోయిన నగదు రూ.5లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేసినట్లు సమాచారం. చోరీకి ముందు ఏటీఎంలో రూ.25 లక్షలకు పైగా నగదును జమ చేసినట్లు తెలిసింది. మూడేళ్ల క్రితం ఇదే మాదిరిగా మెండోరాలోని దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో దొంగలు గ్యాస్‌కట్టర్‌తో లాకర్స్ తీస్తున్నటప్పుడు పెద్ద మొత్తంలో నగదు కాలిపోయింది.

గాలింపు ముమ్మరం

ఏటీఎం దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేకంగా మూడు బృందాలతో గాలింపు చేపట్టినట్లు తెలిసింది. అందులో భాగంగా క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. కాగా, ఈ కేసును సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. ఏటీఎంలో జరిగిన చోరీ ఆధారంగా పాత నేరస్తుల లేదా కొత్త నేరస్తులా లేకుంటే మహారాష్ట్ర దొంగల ముఠా పనే అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా ముంబై మెయిన్ బ్రాంచ్ నుంచి సమాచారం అందుకున్న పోలీసులు పెట్రోలింగ్ వాహనం సైరన్ మోగించుకుంటూ రావడంతోనే దొంగలు అప్రమత్తమై పరారైనట్లు నగరంలో చర్చ జరుగుతోంది.